
# నేను సుమతిని కాను



శ్రీవారు ఆఫీసునుంచి ఇంకా రాలేదు. పిల్లలిద్దరూ స్కూలు నించి వచ్చి హార్లిక్స్ తాగి ఆటలకి పరుగెత్తారు. సాయంకాలం వంట కూడా పూర్తి చేసి, స్నానం చేసి తెల్లటి చీరా తెల్లటి జాకెట్ వేసుకుని, వాలు జడ అల్లుకుని, తలలో పెరట్లో పూసిన రెండు తెల్ల గులాబీలు ఆకులతోబాటు తురుముకున్నాను. తెల్ల చీరెలన్నా, తెల్ల గులాబీలన్నా శ్రీవారికి చెప్పలేనంత యిష్టం. అందుకే నేను తరుచుగా

—గోవిందరాజు సీతాదేవి



తెల్లచీరలే కడుతూ వుంటాను. అద్దం ముందు నిల్చుని తిలకం దిద్దుకుని హాల్లోకి వచ్చాను. రేడియోలో పాటలు వస్తున్నాయి. అవి వినీ వినీ విసుగు కల్గుతూంది. రేడియో ఆఫ్ చేసి పత్రికలు తిర

గేశాము. పావుగంటకి మించి చదవ బుద్ధికాలేదు. పక్కన పడేశాను. ఇల్లంతా విశ్శబ్దంగా వుంది. పెళ్ళి కానప్పుడు పదిమంది వున్న సమిష్టి కుటుంబంలోని సందడి—విసుగు కల్గించేసి. పెళ్ళయి అత్తవారింటి కెడితే అక్కడన్నా ఇల్లు విశ్శబ్దంగా వుంటే బాగుండు అన్పించేసి.

అప్పుడు కావాలని కోరుకున్న విశ్శబ్దం ఇప్పుడు లభ్యమైతే కొత్తలో కొన్నాళ్ళు సంతోషంగా అన్పించింది. కాపురానికి వస్తూనే వేరింటి కాపురం అవటంవల్ల శ్రీవార్ని ఆఫీసుకి పంపిన దగ్గర మంచీ అస్తమానం రేడియో వింటూ, నవలలూ పత్రికలూ చదువుతూ, ఇల్లు నీట్‌గా సర్దుకుంటూ, బట్టల బీరువాలోని చీరలు మాటిమాటికి మడతలు పెట్టి లెక్కపెట్టుకుంటూ, సినీమాలకి షికార్లకి పోతూ కాలం దొర్లించేశాము. కానీ యిప్పుడు యివన్నీ విసుగే కల్గిస్తూన్నాయి. నా పరిస్థితి చూసిన శ్రీవారు—

"మనస్సు కోతిలాంటిది. దానికి నిలకడ వుండదు" అంటారు.

ఈమాట నిజం అన్పిస్తోంది నా అనుభవం. ఈ మనస్సెప్పుడూ ఒక్కలా యెందుకు వుండదు? వున్న వాటిమీద విసుగు- లేనివాటి మీద ఆసక్తి. చిత్రం కదూ! మనిషి వంటరితనం భరించటం కష్టం. నా ఈ తీరిక సమయంలో యెవరైనా వచ్చి కాస్సేపు కూర్చుని కబుర్లు చెప్తే యెంత బాగుండు? నా వంటరి తనం ఎవరికి తెలుస్తుంది? యెలా వస్తారు? ఇరుగు పొరుగు వారితో మితంగా మాట్లాడటమే నా అల వాటు. అమ్మలక్కలని పోగుచేసి అస్తమానం పిల్లిమీదా ఎలకమీదా కబుర్లు చెప్పి కాలక్షేపం చేయటం నా కస్సలు నచ్చని విషయం. ఇందు వల్లనే కావచ్చు- ఈ ఇంట్లో కాపు రానికివచ్చి నాలుగేళ్ళు అయినా ఎవరి తోనూ ఎక్కువగా చనువు కాలేదు. అలా అని విరోధమూ లేదు. ఏ పేరంటంలోనైనా కన్పించిన వారిని 'బాగున్నారా?' అని నేనే పల్క రిస్తాను. వాళ్ళు జవాబిస్తారు. అంతే! అందువల్ల యెవరో వస్తారని నేను ఆశపడటం అవి వేకం. అరుదాటినా ఆఫీసునించి రాని శ్రీవారి మీదకి మళ్ళింది నా కోపం. ఆలోచిస్తూ వీధిగేటు దగ్గరగా వచ్చి నిల్చున్నాను.

"అరవిందగారూ!" అన్న పిలుపుకి ఆలోచనల్లో నించి తేరుకుని తల తిప్పి చూశాను.

ఎదురింటిలో రెండు గదుల వాటాలో అద్దెకి వున్న సరోజ నా

దగ్గరగా వచ్చి పల్కరించింది.

"ఓ – మీరా! రండి – రండి!" సంతోషంతో లోపలికి ఆహ్వానించాను.

సరోజ ఎప్పటిలా లేదనీ, ఏదో బాధ దాచుకుని పైకి ప్రశాంతంగా మాట్లాడాలని ప్రయత్నిస్తోందనీ క్షణంలో గ్రహించేశాను. నాకు ఆశ్చర్యంగా వుంది.

సరోజకి పాతికేళ్ళుంటాయి. తెల్లగా బొద్దుగా కాస్త పొట్టిగా వున్నా, కనుముక్కు తీరు బాగుంటుంది. భర్తకి ఏదో కంపెనీలో వుద్యోగం. ఆరు వందలు జీతం. ఇద్దరు పిల్లల తల్లి. అయినా ఇంకా పెళ్ళి కాని అమ్మాయిలా అనిపిస్తుంది. భర్త జీతం పొదుపుగా ఖర్చు చేస్తూ, నెలకి కొంత మిగులుస్తూ, ఆ డబ్బుతో ఏదో ఒక వస్తువు కొంటూ, దాన్ని తెచ్చి నాకు చూపిస్తూ వుంటుంది. యెప్పుడూ నవ్వుతూ వుండే ఆ ముఖం ఈ రోజిలా వాడిపోయి వుండటం నాకు బాధగా అనిపించింది.

"అలా వున్నావేం సరోజా?" ఆతురత ఆపుకోలేక అడిగాను.

"బాగానే వున్నాను గా!" నిర్లిప్తంగా అంది.

"లేదు, రోజూలా లేదు మీ ముఖం. మీ కళ్ళలో ఏదో బాధ కనిపిస్తోంది. ఏమిటది — చెప్పకూడదా?"

"కాదు."

"మరి-చెప్పండి!" స్థిమితంగా కూర్చుని, ఎదురుగా కుర్చీలో కూర్చున్న సరోజని చూస్తూ అడిగాను.

సరోజ తల వంచుకుని నేల వైపు చూస్తోంది. ఏదో చెప్పాలని ప్రయత్నిస్తోంది. చెప్పలేక పోతోంది. నేను నిశ్శబ్దంగా వుండి పోయాను. రెండు నిమిషాలు అలాగే వుండి నేనే సంభాషణ ప్రారంభించాను.

"నిన్న సినిమాకి వెళ్ళినట్లున్నారు! ఏ సినిమా?"

"..........."

"ఎలా వుంది?"

సరోజ కళ్ళ నుంచి కన్నీళ్ళు జలజలా రాలాయి.

నేను విస్తుపోతూ ప్రశ్నించాను- "అక్కడేమన్నా అయిందా?"

"వెధవ సినిమాకి వెళ్ళకుండా వున్నా బాగుండి పోయేది."

నేను మౌనంగా వుండి పోయాను.

సరోజ కళ్ళు తుడుచుకుని చెప్పసాగింది.

"నిన్న నా ఫ్రెండ్ సావిత్రి వచ్చింది. సినిమాకి పోదాం అని

గొడవ చేసింది. మా పిల్లల్ని పక్కింటి వాళ్ళకి అప్పగించి మ్యాట్నీకి వెళ్ళాం. ఆ పిక్చరు ఏం బాగాలేదు. పైగా కరెంటు పోవటం వల్ల ఆలశ్యంగా వదిలారు. ఇద్దరం హాలు బైటకి వచ్చాం. ఇద్దరికి యిద్దరం- వంటరిగా వెళ్ళ వల్సి వచ్చినందుకు మనస్సులో భయం భయంగా వుంది. బైట చీకటిగా వుంది. రోడ్డు లైట్లుకూడా వెలగటం లేదు. సావిత్రి అసలే పిరికిది. అందులోనూ సందు గొందుల్లో నించి కొంత దూరం నడిచి వెడితేగానీ, మెయిన్‌రోడ్డు రాదు. అందువల్ల అక్కడి వరకూ వెంట వెళ్ళి వద్దామని బయలు దేరాను.

మెయిన్ రోడ్డు ఎక్కించి వెనక్కి తిరిగాను. రిక్షా అయినా దొరికితే బాగుండు అని చూశాను. దొరకలేదు. నా వెనక యెవరో వస్తూన్న అడుగుల చప్పుడుకి కాస్త ధైర్యం వచ్చింది. ఎవరో నాలానే సినిమా చూసి ఇంటి ముఖం పట్టి వుండొచ్చు. వెనక్కి తిరిగి ఆ వ్యక్తి ముఖంలోకి చూడా లనిపించింది. సభ్యతగా వుండదు అని వూరుకున్నాను.

రోడ్డుమీద ఎందరో నడుస్తూ వుంటారు. ఎవరైనా ఒకటే-అను కుంటూ అడుగులు వేస్తున్నాను. అంత క్రితం నే చూసిన సినిమా లోని అసహజ దృశ్యాలు కళ్ళ ముందు కదులుతున్నాయి. జయ మాలిని మూరెడు గుడ్డ చుట్టుకుని డాన్సు చేస్తూంటే హాలులో ఆఖరి తరగతి మగాళ్ళు వేసే ఈలలు గుర్తుకి వచ్చి ఇంకా ఏవగింపు కలుగుతోంది. ఇలా ఆలోచనల్లో మునిగి నడుస్తూన్న నా భుజంమీద ఎవరిదో చెయ్యి పడింది. ఉలిక్కి పడి ఆగిపోయాను. నా ఆలోచ నలూ ఆగిపోయాయి. ఆ చెయ్యి నా భుజం చుట్టూ వచ్చేస్తోంది. ఇనపతీగెలా నన్ను చుట్టేస్తోంది. నా గుండెల్లో దడ ప్రారంభమైంది. వళ్ళంతా చెమట పట్టేసింది.

"ఎవరు?" అని పెద్దగా అర వాలనిపించింది. ప్రయత్నించాను కానీ-నా నోట్లోనించి ఒక్క అక్ష రం కూడా బయటకి రాలేదు.

ఆ వ్యక్తి నా భయాన్నీ, అసహా తవీ పసికట్టేసి మరీ మరీ దగ్గరగా పెనవేసుకోబోయాడు. ఏం జరుగ బోతూ వున్నదో ఊహించగలిగిన నేను 'కెవ్వు' న కేక పెట్టి గింజుకో సాగాను.

ఆ వ్యక్తి ఇంకా బలంగా లాగసాగాడు. నా శక్తినంతా కూర్చుకుని అతన్ని వెనక్కి తోయ

టానికి ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. చుట్టూ చీకటి! ఆ దారి వెంట మనిషి వస్తూన్న జాడ లేదు. నా మొర వినే దేవుడు లేడని తెల్సి, 'రక్షించం'డని అరవ బోయిన నా నోరు మూసేయ బోయాడు. నాకు పిచ్చి శక్తి వచ్చింది. అంతే! అందిన ఆ చేతిని పళ్ళతో పీకేశాను. 'అబ్బా!' అనడం, ఆ చేతులు నన్ను వది లేయటం, కరెంటు రావటం ఒక్క సారే జరిగింది. ఆ లెట్ల వెలుగులో ఒకర్ని ఒకరం ఒకే ఒక్క క్షణం చూసుకున్నాం. అంతే! నా తల గిర్రున తిరిగిపోయింది. అతనూ అలాగే ఐపోయాడు..."

సరోజ ఏకబిగిన చెప్పి హటా త్తుగా ఆగిపోయింది.

ఊపిరి బిగబట్టి వింటూన్న నేను ఆతురతగా అడిగాను- "ఎవ రతను?"

"అతను ఎవరైనా అలాంటి బుద్ధి వున్న పురుషునికి ఏం శిక్ష విధించాలంటారు?"

"చేతులు రెండూ నరికెయ్యాలి. కళ్ళు పీకేసేయాలి. నైతిక విలువ లకి ప్రాధాన్యం ఇవ్వటం మాను కున్న అలాంటి మగాళ్ళని నడి రోడ్డులో నిలబెట్టి ఉరి తీయాలి." ఆవేశంగా అన్నాను.

"ఆగండి! ఇలా ప్రవర్తిం చిన ఆ మగాడు పరాయివాడుకాక మనకి అత్యంత ఆప్తుడై వుంటే?"

నేను అప్రతిభురాలినైనాను. క్షణం ఆలోచించి అన్నాను- "ఎవ రయినా సరే— ఇలాంటి విష యాల్లో క్షమించకూడదు. క్షమించటం అంటే మరోసారి అలాంటిపని చేయటానికి అవకాశం ఇవ్వటమే కదా!" కోపంగా అన్నాను.

సరోజ ఆలోచిస్తూ వుంది. లోలోపల మథనపడుతూ వుంది.

"ఇంతకీ ఆ కిరాతకుడెవరో గుర్తించ గలిగారా?"

సరోజ తల ఊపింది కానీ- పెదవి కదప లేదు.

"ఈనాటి సమాజంలో స్త్రీకి రక్షణ లేదు—గౌరవం లేదు. ఇల్లు వదలి బయటకి వెళ్ళాలంటేనే భయంగా ఉంది. ఇంతకీ ఆ కిరాతకుడెవరో చెప్పలేదు?" అన్నాను.

"ఆయన....నా....భర్తే!" అవ హ్యాం నిండిన మనస్సుతో ఏకా రంగా ముఖం పెట్టి అంది.

"ఆ!!" షాక్ఓంచి తేరుకోలేక పోయాను.

"అవును-ఆయన సాక్షిగా నన్ను అగ్ని సాక్షిగా వివాహం

అదివ భర్త. ఐదు సం॥రాలుగా కాపురం చేస్తున్న భర్త. అయితే నాకంటూ జరిగిందని చెప్పిన అనుభవం నాది కాదు-సావిత్రిది. అది ఇల్లుచేరి ఈ జరిగినదంతా వుత్తరం రాసి నాకు ఈ రోజు ఉదయమే పంపింది. దోషిని ప్రశ్నించవలసిన అవసరం లేదు. చేతిగాయం పోటుపెట్టి ఏడిపిస్తూ సాక్ష్యం చెప్తూనే వుంది. అయినా వుండబట్టలేక అడిగేశాను. తనకేం తెలియదని బుకాయించబోయాడు. తర్వాత క్షమించమని వేడుకున్నాడు. కానీ....కానీ అరవింద గారూ! నా మనస్సు విరిగిపోయింది. అసహ్యం వేసుకుపోయింది. ఇప్పుడు నేనేంచేయాలి? అని ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చేశాను. నా ఇద్దరు పిల్లలని తీసుకుని మా అక్క దగ్గరికి వెళ్ళిపోతున్నాను. అక్క నా కేదో ఉద్యోగం చూడగలదు. ఆ ధైర్యం నాకుంది. నేను బ్రతగ్గలను. ఇద్దరు పిల్లల్ని బ్రతికించుకోగలను అనే ఆత్మ విశ్వాసంతో ఈ ఇంట్లోనించి ఈ రోజే వెళ్ళిపోతున్నాను. ఈ అడుగు మరి వెనక్కి వెయ్యను. అసలు వెనక్కి తిరిగి జరిగిన జీవితాన్ని గుర్తుచేసుకోను."

"సరోజా!" ఆవేదనగా సరోజ చేతిని నా చేతిలోనికి తీసుకున్నాను.

సరోజ విషాదంగా నవ్వింది. "అరవిందగారూ! జరిగినది చెప్పినప్పుడు మీరేమన్నారు? అలాంటి వ్యక్తులని క్షమించి వదలకూడదన్నారు- గుర్తుందా? ఈ క్షమ మరో తప్పు చేయడానికి అవకాశం ఇస్తుంది కనుక. అలా అవ్వకుండా శిక్ష విధించాలన్నారు. నా భర్తకి అలాంటి శిక్ష ఏదీ విధించే శక్తి నాకు లేదు. అందుకే నేను ఆయన జీవితంలోంచి తప్పుకుంటున్నాను. నేను సీతా-సావిత్రీ- అనసూయా-సుమతినీ కాను. కేవలం ఈ కాలం స్త్రీని. భర్త నన్ను తప్ప మరో స్త్రీని కన్నెత్తి చూడటం సహించలేని సామాన్య స్త్రీని. చూడండీ! మాటల్లో మర్చిపోయాను. నాకు టైంమైంది. వెళ్ళి వస్తాను" నా చేతిలోని తన చేతిని మెల్లగా తీసుకొని అడుగులో అడుగు వేసుకుంటూ వాకిలి గేటు దాటి చకచకా అడుగులు వేస్తూ వెళ్ళిపోతున్న సరోజని చూస్తూ అలాగే వుండిపోయాను.

'అవును! సరోజ-సీతా సావిత్రీ అనసూయా కాదు. సుమతి అసలే కాదు. ఈ కాలం స్త్రీ. ఈ కాలం స్త్రీలు సరోజలాంటి వాళ్ళని చూసి గర్వపడాలి!' •